
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 27 అక్టోబరు 2024



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోయినపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పెండ్యాల కిష్టారెడ్డి, అనుపట్ల తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, పులి హనుమాన్లు, డబ్బు రాదా, మొగిలిపాలెం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని లబ్ధిదారు వరవ్వకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మారెడ్డి, సాహెబ్, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాలపోచయ్య, సత్తయ్య శ్రీనివాస్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

సిరిసిల్ల టౌన్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శనివారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రొఫెసర్ సాయిబాబా సంస్కరణ సభ కరపత్రాన్ని రాష్ట్ర, జిల్లా ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొమురయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పట్టణ సొబగులు



- రెండు మున్సిపాలిటీలు, 152 రెవెన్యూ గ్రామాలను వీటీడీఏలో కలుపుతూ నోటిఫికేషన్
- వెనకబడిన ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయనే భావన
- జిల్లా విస్తీర్ణం 1908 కిలోమీటర్లు, 5.52 లక్షల జనాభా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పల్లెలు పట్టణ సొబగులు సంతరించుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 13 జిల్లాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో విలీనం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) పరిధిని పెంచుతున్నట్లు పేర్కొంది. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, పట్టణాన్ని అభివృద్ధి చేసే దిశగా 2016 ఫిబ్రవరిలో గత ప్రభుత్వం వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఏర్పాటు చేసింది. వీటీడీఏ ద్వారా వేములవాడ పట్టణ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వీటీడీఏ పరిధిని పెంచుతూ వేములవాడ, సిరిసిల్ల, రెండు మున్సిపాలిటీలతో పాటు 152 రెవెన్యూ గ్రామాలకు వర్తింపజేస్తున్నట్లు పేర్కొంది.

అభివృద్ధి దిశగా అడుగులు

జిల్లాను వీటీడీఏ పరిధిలోకి మార్చడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకెళ్తుందని భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రం కూడా మారుతుందని చర్చించు కుంటున్నారు. జిల్లా 1908 కిలోమీటర్లలో విస్తరించి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 5.52 లక్షల మంది ఉన్నారు. వీటీడీఏ విస్తరణ ద్వారా పట్టణాభివృద్ధి సంస్థలోకి జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీలు, ఉండగా వెయ్యి జనాభా తక్కువగా ఉన్న గ్రామాలు 100 ఉండగా, 1001 నుంచి 5 వేల వరకు 148 గ్రామ పంచాయతీలు, 5 వేల పైనా 7 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పెద్ద గ్రామ పంచాయతీలు పట్టణాభివృద్ధి దిశగా విస్తరి స్తాయని భావిస్తున్నారు.

కొత్త మున్సిపాలిటీలు ఏర్పడనున్నాయి. రాబోయే రోజుల్లో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, బోయినపల్లి, వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాలు వీటీడీఏ పరిధిలోనే ప్రణాళికలు రూపొందనున్నాయి. డీటీసీపీని కూడా రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. గ్రామాలు హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చోటు చేసుకున్న మార్పులు జిల్లాలో కూడా ఏర్పడనున్నాయి.

మిగతా 8వ పేజీలో..

పరిశ్రమల అనుమతులు సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో టీఎపీసీ, టీఎస్‌ఐపాస్, టీప్రైడ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులు, అనుమతులు కోసం పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను తెలుసుకున్నారు. టీఎపీసీ, టీఎస్‌ఐపాస్ కింద పీసీబీ రెండు దరఖాస్తులు, సెస్, ఫ్యాక్టరీలు, నీటి పారుదల శాఖ వద్ద ఒక్కో దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. టీ ప్రైడ్ కింద ఎస్సీలకు 21, ఎస్టీలకు 19, దివ్యాంగులకు ఒకటి, పావలా వడ్డీ కింద రెండు యూనిట్లు మంజూరైనట్లు జీఎం గణేష్‌రాం వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల ఏడీ భారతి, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎల్‌డీఎం మల్లికార్జున్, నీటి పారుదల శాఖ అధికారి అమరేందర్‌రెడ్డి, సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీటీసీపీవో అన్సారీ, డీటీడీవో జనార్దన్ పాల్గొన్నారు.

నేడు మిడ్‌మానేరులోకి చేప పిల్లల విడుదల

సిరిసిల్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్, వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో లక్ష చేపపిల్లలను విడుదల చేయనున్నట్లు మత్స్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరుకానున్నట్లు పేర్కొంది.

రాజన్న ఆలయ ఉద్యోగికి పదోన్నతి



ఉత్తర్వులు అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నగ్గు దిలీప్‌కు పదోన్నతి లభించినట్లు ఆలయ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న ఆలయంలోని ఈవో కార్యాలయంలో శనివారం దిలీప్‌కు సీనియర్ అసిస్టెంట్ ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ, సూపరింటెండెంట్ అశోక్, విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్‌లు పురాణం వంశీ, మందస్వామి, కూరగాయాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

కోనరావుపేట, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం మర్తనపేటలో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారధి పొత్తూరి రాజు కళా బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై కళాజాతా నిర్వహించారు. ఆరు గ్యారంటీలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్



ప్రశంసపత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

8

వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించండి

- బెటాలియన్ పోలీసుల ధర్నా
- డీజీపీకి నివేదిస్తామన్న ఎస్పీ



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

7

ఉపాధి పనుల్లో అలసత్వం వద్దు



ముస్తాబాద్ ప్రజావేదికలో డీఆర్డీవో శేషాద్రి

ముస్తాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని, ఉపాధి హామీ కులీలకు డబ్బులు చెల్లించే క్రమంలో హాజరును ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయా లని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. ముస్తాబాద్ మండల పరిషత్‌లో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ ఆడిట్‌లో రికవరీ రూ.20360 రాశారు. పని చేసిన కులీలకు డబ్బులు చెల్లించాలని పనిచేయకున్నా చేసినట్లు హాజరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ కులీలకు పనిదినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రామారావు, ఎంపీడీవో రాజేందర్, ఎస్టీఎం అజ్మాతుల్లా, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణ్, ఎస్ఆర్పీ భగవంతరావు, జూనియర్ క్వాసీ నవీన్‌కుమార్, జేఈ రాజనర్సు, టీఏ రమేశ్ పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల ఏర్పాటుకు పోటీ

- 112 దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు
- ఎన్‌వోసీకి ఇబ్బందులతో అనుమతికి జాప్యం



ఆర్డీవోతో మాట్లాడుతున్న దరఖాస్తుదారులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు టపాసుల దుకాణాల ఏర్పాటుకు పోటీ పెరిగింది. ఈ నెల 31న దీపావళి పర్వదినం కావడంతో టపాసుల దుకాణాలు నెల కొల్పడానికి వ్యాపారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దుకాణాలు నెలకొల్పేందుకు 15 రోజుల ముందునుంచే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దాదాపు 112 టపాసుల దుకాణాలు నెల కొల్పేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు రెవెన్యూ నుంచి మాత్రమే అనుమతి లభించింది. ఫైర్, పోలీసు, మున్సిపల్‌శాఖల నుంచి ఎన్ వోసీ లభించాల్సి ఉంది. జిల్లాలో 112 టపాసుల దుకాణాల్లో సిరిసిల్ల 57, వేములవాడ 42, ఎల్లారెడ్డిపేట 8, ముస్తాబాద్ 1, ఇల్లంతకుంట 1 గంభీరావుపేట 1, తంగళ్లపల్లిలో 2 చొప్పున దరఖాస్తులు ఉన్నాయి. రుద్రంగి, చందుర్తి, బోయిన్‌పల్లి, వీర్నపల్లి మండలాల్లో దరఖాస్తు లేకుండానే టపాసుల దుకాణాలు ఏర్పాట్లు చేసుకుంటారు. జిల్లాలోని అగ్రహారంలో టపాసుల హోల్‌సెల్ దుకాణం ప్రారం భానికి సిద్ధం చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల కోసం పోటీ పెరగడంతో అన్ని దుకా ణాలకు డ్రా పద్ధతి కేటాయించాలని అధికారులు నిర్ణయించారు.

నిబంధనలు తప్పనిసరి

ప్రతి టపాసుల దుకాణాన్ని వ్యాపారులు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలి. నివాసాలకు దూరంగా బహిరంగ ప్రదే శాల్లో షెడ్లు వేయాలి. ప్రతీ దుకాణం వద్ద ఇసుక, నీరు అందు బాటులో ఉంచాలి. టపాసుల దుకాణాల ఏర్పాటుకై రెవెన్యూ, పోలీసు, ఫైర్, మున్సిపల్‌శాఖల క్లియరెన్స్ తప్పనిసరి పొందాలి. ఈ నెల 28, 29, 30, 31న టపాసులు విక్రయించడానికి వ్యాపా రులు సిద్ధం చేసుకున్నారు. ప్రతి ఒక్క వ్యాపారి తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణంగా టపాసుల విక్రయాలు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. సిరిసిల్లలోని మానేరువాగు వద్ద, వేముల వాడలో రెండో బైపాస్ రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

వేములవాడలో పైరవీలు

వేములవాడ: దీపావళి పండుగ సందర్భంగా వేములవాడ పట్టణంలో బాణాసంచా దుకాణాల ఏర్పాటు కోసం అవసరమైన లైసెన్సు పొందేందుకు వ్యాపారుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో పలువురు వ్యాపారులు తమకు సన్నిహితులైన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో పైరవీలు చేస్తూ తమకు అనువైన దుకాణం నంబరు పొందేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేములవాడ పట్టణంలో బాణాసంచా విక్రయించే దుకాణాలలో ఒకటి నుంచి 5వ నెంబర్ వరకు మొదటి ఐదు దుకాణాలు, అదేవిధంగా 30 నుంచి 35 వరకు చివరి ఐదు దుకాణాలు తమ వారికే కేటాయించాలంటూ పలువురు నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలిసింది. వేములవాడలో పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయానికి ఇప్పటి వరకు 35 దరఖాస్తులు అందాయి. తొలుత దరఖాస్తు చేసుకున్న వారికి తొలుత లైసెన్సు నంబరు కేటాయించే ఆనవాయితీలో భాగంగా ఈ సంవత్సరం కూడా అదే విధంగా దుకాణాల నెంబర్లు కేటాయించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే తమకు కోరిన నంబరు దుకాణం కేటాయించాలంటూ దరఖాస్తుదారులు ప్రజాప్రతినిధులు, కీలక రాజకీయ నాయకులతో ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఇదిలా ఉండగా దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత కూడా దరఖాస్తులు స్వీకరించారంటూ శనివారం సాయంత్రం పలువురు దరఖాస్తుదారులు ఆర్డీవో కార్యాలయంలో ఆందోళనకు దిగారు. దుకాణాల నంబర్ల కేటాయింపుపై పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వస్తుండడంతో స్థానిక ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్ డ్రా పద్ధతిలో లేదా, ముందుగా వచ్చిన దరఖాస్తులకు ముందుగా అనే పద్ధతి ప్రకారం దుకాణాలు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా బాణాసంచా దుకాణాల ఏర్పాటు సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను వ్యాపారులు సరిగా పాటించే విధంగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వేములవాడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బద్దిపోచమ్మ ఆలయం వరకు సీసీరోడ్డు నిర్మాణం కోసం శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయం నుంచి బద్దిపోచమ్మ ఆలయం వెళ్లే రహదారి గుంతలమయంగా మారినందున కొత్తగా సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అతిపెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, రాజన్న ఆలయంతోపాటు వేములవాడ పట్టణాన్ని సమానంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేములవాడ-తిప్పాపూర్ మధ్య అర్ధంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగించడానికి వీలుగా అవసరమైన భూ సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 6 కోట్ల 96 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, వేములవాడ క్షేత్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే వేములవాడలో పర్యటించనున్నట్లు చెప్పారు. సిరిసిల్ల ప్రాంతంలోని మరమగ్గాల యజమానులు యారన్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ కేంద్రంగా 50 కోట్ల రూపాయల మూలధనంతో యారన్ డిపో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, వార్డు కౌన్సిలర్ ప్రతాప హిమబిందు పాల్గొన్నారు.

పారదర్శకంగా టీచర్ల సర్దుబాటు



కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ ద్వారా చేపట్టిన టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలోని 111 ఉన్నత పాఠ శాలలు, 39 ప్రాథమికోన్నత పాఠశాలు, 330 ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన వాటిలో కొన్ని పాఠ శాలల్లో టీచర్ల కొరత ఉంది. దీనికి అనుగుణంగా 252 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా అయా పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వృత్తి నిబద్ధత పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈవో రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

దేశవాళీ ఆవుల అభివృద్ధే లక్ష్యంగా...

- సత్ఫలితాలు ఇస్తున్న శాస్త్రవేత్తల కృషి
- ఆవులు.. కోళ్ల ఫాంల అభివృద్ధిపై రైతులకు అవగాహన
- పశు వైద్యులను తీర్చిదిదుతున్న కళాశాల


ఆవుల ఫాం


పీవీ నర్సింహారావు పశువైద్య కళాశాల

ఓ వైపు అరుదైన పరిశోధనలు.. మరో వైపు పశువులకు వైద్యం అందిస్తూ.. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌తో కూడిన బోధన అందిస్తూ ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందింది.కోరుట్ల పశువైద్య కళాశాల. ఇక్కడి ప్రొఫెసర్లు మేలు జాతి దేశవాళీ ఆవుల సంతతి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఎప్పటికప్పుడు పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. 2008లో ఏర్పాటైన ఈ కళాశాల రైతులకు అత్యుత్తమ సేవలు అందిస్తోంది.

కోరుట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పశువైద్య కళాశాల అరుదైన పరిశోధనలతో అద్భుత ఫలితాలు సాధిస్తోంది. . కళాశాల డీన్ దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిండమార్పిడి విధానం (ఐవీఎఫ్-ఇన్ విట్రో ఫర్టిలైజేషన్) సత్ఫలితాలనిస్తోంది. ఈ కేంద్రం ఆధ్వర్యంలో వివిధ జిల్లాలో ఇప్పటి వరకు 250 ఆవుల్లో పిండ మార్పిడి చేయగా వాటికి దూడలు జన్మించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. శతాబ్దం క్రితం దేశవాళీ జాతులైన సాహివాల్, గిర్, దార్ పార్కల్ వంటి ఆవుల పాల ఉత్పత్తి ఒక ఈత కాలంలో (300 రోజులు) సుమారు 2,500 నుంచి మూడు వేల లీటర్లు ఉండేది. పాల దిగుబడి పెంచే లక్ష్యంతో విదేశీ ఆంబోతుల వీర్యాన్ని కృత్రిమ గర్భోత్పత్తి పద్ధతితో దేశవాళీ ఆవుల ప్రవేశపెట్టి సంకరజాతి దూడలను ఉత్పత్తి చేశారు. దీంతో పాల దిగుబడి పెరిగినప్పటికీ ఎండ తీవ్రతను తట్టుకోలేక అవి తరుచూ అనారోగ్యానికి గురై చనిపోయేవి. ఈ నేపథ్యంలో దేశవాళీ ఆవుల జాతుల అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో 2019లో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని ప్రవేశ పెట్టి దేశ వ్యాప్తంగా 30 ఐవీఎఫ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. జిల్లా కోరుట్ల పశువైద్య కళాశాలకు ఒక యునిట్‌ను కేటాయించి పిండమార్పిడి కార్యక్రమాలను చేపడుతున్నారు. అధిక పాల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన దేశవాళీ ఆవుల నుంచి అండాలను సేకరించి వాటిని ప్రయోగశాలలో మేలైన అంబోతుల వీర్యంతో ఫలదీకరణం చేసి ఆ పిండాలను ఆవుల గర్భాశయంలో ప్రవేశపెట్టడం ద్వార మేలు రకం దూడలను ఉత్పత్తి చేస్తున్నారు.


పశువుకు చికిత్స చేస్తున్న విద్యార్థులు

● 2008లో కళాశాల ఏర్పాటు..

కోరుట్ల పట్టణంలో పశు వైద్య కళాశాలను 2008లో ఏర్పాటు చేశారు. కళాశాల ఏర్పడిన మొదటి సంవత్సరం 75 మంది విద్యార్థులతో పట్టణంలోని ఆదర్శనగర్ ప్రాంతంలోని ఓ భవనంలో కళాశాలను నిర్వహించింది. పట్టణ శివారులో సుమారు 50 ఎకరాలలో నూతన భవన నిర్మించారు. 2015లో కొత్త భవనంలో విద్యా బోధన ప్రారంభమైంది. 400 మంది విద్యార్థులకు విద్యాబోధనకు అనుగుణంగా తరగతి గదులతో పాటు హాస్టల్ వసతులను ఏర్పాటు చేసి మౌలిక వసుతులు కల్పించారు.. ప్రతి నెలలో వారం రోజులు పౌల్ట్రీ ఫాం నిర్వాహకులకు అవగాహన సదస్సులు, వివిధ కోళ్ల పెంపకం, పక్షుల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటారు. కళాశాల అవరణలో విద్యార్థులచే వైద్య పరీక్షలు నిర్వహించి యజమానులకు పలు సూచనలు సలహాలను అందిస్తున్నారు.

● పూర్తి స్థాయిలో టీచింగ్ స్టాఫ్

కళాశాలలో పూర్తి స్థాయిలో టీచింగ్ స్టాఫ్ ఉండే విధంగా కళాశాల ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కళాశాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు బోధనా సిబ్బంది 50 మంది వరకు ఉన్నారు. కళాశాల అవసరాల నిమిత్తం ఇతర కళాశాలలో ఉన్న ప్రొఫెసర్లను పిలిపించి అదనపు తరగతులు నిర్వహిస్తారు.

● ఎంసెట్, నీట్ ద్వారా ఎంపిక

ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 85 శాతం, నీట్ ద్వారా ర్యాంకు పొందిన 15 శాతం విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తారు. కళాశాలలో డీవీఎస్సీ, ఏహెచ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. నాలుగున్నరేళ్ల పాటు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు మరో సంవత్సరం క్షేత్ర సాయి శిక్షణతో పాటు పశువుల చికిత్సపై అవగాహన కల్పించి సర్టిఫికెట్లను అందిస్తారు. పట్టణంలోని పశువైద్య కళాశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అప్పటి ప్రభుత్వం పీవీ నర్సింహారావు పేరు పెట్టింది.

కళాశాలలో పూర్తి స్థాయిలో విద్యా బోధన
- అసోసియేట్ డీన్ దాసరి శ్రీనివాస్



కళాశాలలో పూర్తి స్థాయిలో విద్యా బోధనను అందించి పశువైద్యులను తీర్చిదిదుతున్నాం. ప్రస్తుతం ఎంసెట్ ఫలితాలలో ర్యాంకు సాధించిన విద్యార్థులు వ్యవసాయ పశు వైద్య సంయుక్తంగా అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులను కోరుతున్నాను.

ఉచిత సేవలు అందిస్తా
- పశువైద్య విద్యార్థి శశాంక్ (నాగర్ కర్నూల్)



పశువైద్యం శిక్షన పొందిన అనంతరం పశువులకు ఉచిత సేవలు అందిస్తాను. గ్రామ స్థాయిలో శిబిరాలను నిర్వహించి పశు సంరక్షణకు చొరవ చూపుతా.

ఒమన్‌లో గుండెపోటుతో ఒడ్డెలింగాపూర్‌వాసి మృతి


అశోక్ (ఫైల్)

రాయికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిని వెతుక్కుంటూ గల్ఫ్ వెళ్లిన వలస జీవి ఈ నెల 25న గుండెపోటుతో మృతి చెందాడు. ఈమేరకు అతని స్నేహితులు స్వగ్రామానికి సమాచారం అందజేశారు. రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి అశోక్ (39) గుండెపోటుతో ఈ నెల 25న మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఏడు నెలల క్రితం ఉపాధి కోసం ఒమన్ వెళ్లిన అశోక్ ఆజాద్ వీసాపై అక్కడ పనిచేస్తూ ఉండగా శుక్రవారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో గమనించిన తోటి స్నేహితులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అశోక్‌కు భార్య హేమ, కుమారుడు సుశాంత్ ఉన్నారు. త్వరితగతిన అశోక్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రామడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రారం, చిప్పకుర్తి గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శేఖర్ శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

రామడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశరాజుపల్లి శివారులో మట్టిని రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కొద్దీ గంటల్లోనే వదిలిపెట్టారు. కాగా డాక్యుమెంట్లు తనిఖీ చేసుకొని విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎలుగుబంటి సంచారం

హుజురాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ చెరువు సమీపంలో శనివారం ఎలుగుబంటి సంచరించింది. స్థానికులు కొందరు ఎలుగుబంటిని ఫొటోలు, వీడియోలు తీశారు. మార్నింగ్ వాక్‌కు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలంటూ సోషల్ మీడియాలో వైరల్ చేశారు. స్థానికుల భయాందోళన చెందుతున్నారు.


పొలంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

బేగంపేట్ పోస్టాఫీసులో నకిలీ పాస్‌బుక్కుల దందా

- పేదల సొమ్ము స్వాహా..
- పోస్టల్ ఉన్నతాధికారుల విచారణ


విచారణ జరుపుతున్న పోస్టల్ అధికారులు

రామగిరి, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట్ పోస్ట్ ఆఫీసులో నకిలీ పాస్‌బుక్కుల దందా శనివారం వెలుగులోకి వచ్చింది. పోస్ట్ ఆఫీసులో నకిలీ పాస్‌బుక్కులు జారీ చేసి డిపాజిట్ సొమ్మును స్వాహా చేసిన ఉదంతం సంచలనం రేపుతోంది. గ్రామంలోని సుమారు 30 మంది పైగా ఖాతాదారుల నుంచి రూ.35 లక్షల రూపాయలను సేకరించి డిపాజిట్లను స్వాహా చేసినట్లు శనివారం విచారణలో వెల్లడైనట్లు విచారణ అధికారి తెలిపారు. నకిలీ ఖాతాలపై మరింత లోతైన విచారణ చేపడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ మోహన్ తెలిపారు. డిపాజిటర్స్ నుంచి సేకరించిన డబ్బులకు నకిలీ పాస్‌బుక్కులు, రశీదులు జారీ చేస్తూ ఖాతాదారులను నమ్మించి మోసం చేశారు. నకిలీ పాస్‌బుక్కుల వ్యవహారం వెలుగులోకి రావడంతో ఖాతాదారులు పోస్ట్ ఆఫీసు ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. పీఎం జీవన్ సమృద్ధి యోజనం కింద డిపాజిట్ అయిన సొమ్ము సైతం పూర్తి స్థాయిలో అందలేదని బాధితులు వాపోయారు. నకిలీ పాస్‌బుక్కుల దందాపై ఉన్నతాధికారులకు ఖాతాదారుల ఫిర్యాదు మేరకు జమ్మికుంట సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ శనివారం విచారణ చేపట్టారు. ఈ విషయమై మోహన్‌ను వివరణ కోరగా, గ్రామంలో సుమారు 300 మంది ఖాతాదారుల పాస్‌బుక్కులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న రికార్డు ప్రకారం ఉన్న ఖాతాదారులకు న్యాయం చేస్తామన్నారు. పాస్‌బుక్కులను పరిశీలన చేపడుతామని, ఖాతాదారుల సంయమనం పాటించాలన్నారు.

● బేగంపేట్ గ్రామానికి చెందిన స్థానిక ఖాతాదారులు రంగం శాన్విత, రంగం కృతిక తల్లిదండ్రులు డిపాజిట్ల ఆరా తీసేందుకు సెంటినరీకాలనీలోని పోస్టుఆఫీసు కార్యాలయానికి శుక్రవారం సాయంత్రం వెళ్లారు. వీరి ఖాతా నంబర్లను సంబంధిత సబ్ పోస్టు మాస్టర్ శివ సిస్టంలో ఎంటర్ చేయగా వీరి పేర్లు ఖాతాలో నమోదు కాలేదని బదులిస్తూ, ఇవి నకిలీ ఖాతా నబర్లతో కూడిన పాస్ పుస్తకాలని నిర్ధారించారు. దీంతో ఖంగుతిన్న ఖాతాదారులు ద్వారా గ్రామంలో తెలియడంతో మిగతా ఖాతాదారులు సెంటినరీకాలనీలోని తపాలా కార్యాలయానికి క్యూ కట్టారు. అవి కూడా నకిలీవని తేలడంతో శనివారం బేగంపేట్ గ్రామంలో విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు గ్రామంలో తోలి రోజు అధికారులు విచారణ చేపట్టారు.

● పోస్టల్ మేనేజర్ హస్తం ఉంది..
- పోస్టుమాస్టర్ హేమ

పోస్టల్ ఖాతాదారుల విషయంలో తప్పు జరిగింది. ఇందులో పోస్టల్ మేనేజర్ నరేంద్రచారి హస్తం ఉంది. ఇందులో నా తప్పు లేదు. ఖాతాదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. నాకు నెల రోజుల సమయం ఇస్తే అందరి డబ్బులు తిరిగి ఇస్తాను.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కొడిమ్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లోని చెరువు గ్రామానికి చెందిన గుమ్మడిదారి రాజేశం (52)శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ అర్జ రాజు తెలిపిన వివరాల మేరకు రాజేశంకు అప్పులు ఎక్కువైనాయి. జీవించడానికి ఉపాధి లేక పోవటంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమ్మిత్తం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని బార్య అనసూయ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ ఎంపీవో సస్పెన్షన్

బీర్‌పూర్,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ ఎంపీవో రామకృష్ణా రాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బి సత్యప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రాగా ఉన్నతాధికారులు జారీ చేసిన మెమోకు బదులివ్వకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడని విచారణలో తేలినందున ఎంపీవో రామకృష్ణా రాజును సస్పెండ్ చేశామని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2022-23 నుంచి 2024-25 సంవత్సరం వరకు రికార్డులు పరిశీలించగా స్టేషనరీ ఖర్చులు, ఆఫీస్ నిర్వహణ, నెట్ బిల్, ప్రింటింగ్ బిల్, ఎలక్ట్రిసిటీ ఖర్చులు కంప్యూటర్ పరికరాలకు ఖర్చు చేసినట్లు తప్పుడు లెక్కలతో మొత్తం 3,95,011రూపాయల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డట్లు తేలడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

నిరుపేదలకు వరం ఆయుష్మాన్ భారత్

సమాచారం

- సీనియర్ సిటిజన్లకు సేవలు
- స్పెషలిస్టు డాక్టర్లను వినియోగించుకోవాలని ప్రభుత్వ నిర్ణయం
- ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా ప్రైమరీ హెల్త్ సెంటర్లు



సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. పలు రకాల వైద్యసేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసం ఆసుపత్రుల్లో ఉన్న స్పెషలిస్టు వైద్యుల సేవలను వినియోగించుకోనున్నారు. ఆదాయంతో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు, ఆపైన ఉన్న వృద్ధులందరూ ఆయుష్మాన్ భారత్‌లో చేరడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. అధిక వైద్య ఖర్చుల కారణంగా ఎవరూ ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్నదే ఈ పథకం ఉద్దేశం. సీనియర్ సిటిజన్లు కుటుంబ ప్రాతిపదికన ఐదు లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య బీమా కవరేజీతో లబ్ధి పొందవచ్చు. వైద్య పరీక్షలు, చికిత్స, మెడికల్ ఇంప్లాంటేషన్, నాన్ ఇంటెన్సివ్ వంటి సేవలు ఆయుష్మాన్ భారత్ ద్వారా పొందవచ్చు.

12 వైద్య సేవల కోసం ఏర్పాట్లు...
- డాక్టర్ సుజాత, కరీంనగర్ డీఎంహెచ్‌వో

ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలతోపాటు మరో 12 వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పైలట్ ప్రాజెక్టుగా యాదాద్రి భువనగిరిని తీసుకున్నారు. ఆ తరువాత దశల వారీగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తారు. గర్భిణులకు ప్రసవ సేవలు, నవజాత శిశువు ఆరోగ్య సేవలు, బాల్య, కిశోర, శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు, సంక్రమిత వ్యాధుల నిర్వహణ, సాధారణ రుగ్మతలకు ఔట్ పేషంట్ సేవలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, ఈఎన్‌టీ సేవలు, సాధారణ నోటి ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్య సేవలు, మానసిక ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్, నిర్వహణ తదితర సేవలు అందుబాటులోకి రానున్నాయి.

● కార్డు పొందడం ఇలా...



ఆయుష్మాన్ భారత్ కార్డు కోసం అధికారిక వెబ్‌సైట్ లేదా సమీప కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లాలి. దరఖాస్తుదారుడి బయోమెట్రిక్, గుర్తింపు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ అర్హత రుజువు, కుల ధ్రువీకరణ పత్రం, మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ అడ్రస్ అందించాలి. జిల్లాలో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లు, 139 సబ్ సెంటర్లు, 97 ఆయుష్మాన్ భారత్, నాలుగు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. వీటన్నింటిని ఇప్పుడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా పేరు మార్చారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కేసులో పెద్దపల్లి జిల్లా బంధంపల్లికి చెందిన అద్వాల శ్రీనివాస్‌కు 22,659 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ పెద్దపల్లి జిల్లా సెషన్స్ జడ్జి హేమంత్‌కుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. శ్రీనివాస్ 2017లో విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడగా కోర్టు అప్పుడు వెయ్యి రూపాయలు జరిమానా విధించగా, మళ్లీ 2018లో విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడిన కేసులో తాజాగా జరిమానా విధించారని తెలిపారు.

ఒకరికి స్వల్ప గాయాలు

హుజూరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం జమ్మికుంట రోడ్‌లోని తహసీల్దార్ కార్యాల యం ఎదుట నిలిపి ఉంచిన కారును శనివారం ట్రాక్టర్ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట కారు నిలిపి ఉంది. వెనుక నుంచి ట్రాక్టర్ కారును ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరి రిమాండ్

శంకరపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేశవపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు శనివారం హుజూరాబాద్ కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనివాస్ ఈ నెల 24న రాత్రి తన ఇంటి వద్ద గొడవ జరుగుతుందని డయల్ 100 కు కాల్ చేశారు. డ్యూటీలో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ చేస్తూ వీడియో చిత్రీకరిస్తున్నారు. ఈ సమయంలో గొల్లెన శ్రీనివాస్, అతని అల్లుడు మెరుగు పవన్ బ్లూకోల్ట్స్ సిబ్బం దిని దూషిస్తూ అడ్డుకున్నారు. గొల్లెన శ్రీనివాస్, మెరుగు పవన్‌లను శనివారం అరెస్టు చేసి హుజూరాబాద్ ఫస్ట్ అడిషన ల్ జేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ మేరకు వారికి మేజిస్ట్రేట్ అలేఖ్య 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

బెదిరింపులపై కేసు నమోదు

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భూముల విష యంలో పాత కక్షలతో రెండు నెలల కిందట తన ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి ఇంటి అద్దాలు పగులగొట్టిన అరవిందరావును నష్టపరిహారం విషయంలో శనివారం అడగగా చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు మూడో ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని అన్నారు.

పేకాట శిబిరంపై దాడులు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు శనివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఆ సమయం లో తొమ్మిది మంది పేకాట ఆడుతున్నా రు. పోలీసులను గమనించి ఐదుగురు పరారయ్యారని సీఐ తిరుమల్‌గౌడ్ చెప్పా రు. పట్టుబడ్డ నలుగురి నుంచి 11,280 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీట్ బజార్‌లో ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రాయికల్ మండల కేంద్రానికి చెందిన మెడపట్ల జలపతి అనే వ్యక్తి కొన్నిరోజులుగా టీట్ బజార్ ప్రాంతంలోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. శుక్రవారం తన స్వగ్రామానికి వెళ్లి శనివారం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లుగా గుర్తించాడు. దొంగలు బీరువా పగులగొట్టి ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు 80 వేల రూపాయలను అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకవెళ్లారు. జిల్లా కేంద్రానికి చెందిన పెండెం గంగాధర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ చేసి మెట్‌పెల్లికి పని మీద వెళ్లి తిరిగి వచ్చాడు. తన ద్విచక్ర వాహనం కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పొలం దగ్ధం


కాలిపోయిన వరి పంట

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోతకువచ్చిన వరి పొలం శనివారం దగ్ధమైంది. కిష్టంపేట గ్రామానికి చెందిన మాదాసు మహేందర్ అనే రైతు తన రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి పంట వేశాడు. వరి పంట కోతకు వచ్చింది. రైతు పొలంలో ఉన్న 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు ఎగసిపడి కోతకు వచ్చి గొలుసులతో ఉన్న ఎండిన వరి పంటపై పడింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వరిలో పడి సుమారు రెండు ఎకరాల వరి పంట చేతికి అందకుండా బూడిద పాలయ్యింది. కోతకు వచ్చిన పంట కాలిపోవడంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సుమారు రెండు ఎకరాలు వరి పంట కాలిపోయి లక్ష రూపాయలు నష్టపోయినట్లు రైతు మాదాసు మహేందర్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గోదావరిఖని టూటౌన్ ఎస్ఐ సస్పెన్షన్

ఫెర్టిలైజర్‌సిటీ/కోల్‌సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గోదవరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై అప్పస్ సోనియాను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశార. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎస్సైపై అవినీతికి పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసినట్టు ఐజీ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా సోనియాను సస్పెండ్ చేస్తున్నట్టు ఐజీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్సై సోనియా వారం రోజుల క్రితం గోదావరిఖని టూటౌన్‌లో విధుల్లో చేరారు.

డబ్ల్యూపీసీ పోటీలకు ఎంపికైన నేహా



స్వర్ణపతకం అందుకుంటున్న నేహా

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన షేక్ నేహా డబ్ల్యూపీసీ(వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్) పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం కోచ్‌లు, క్రీడాభిమానులు నేహాను అభినందించారు. నేహా కుటుంబ పోషణ కోసం భర్తకు చేదోడు వాదోడుగా ఉండేందుకు మెహందీ ఆర్టిస్టుగా పనిచేసేది. భర్త అఫ్రోజ్ సహకారంతో సిద్దిపేటలోని ఓ జిమ్‌లో చేరింది. పవర్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ పొందింది. 2024 మే 5న హైదరాబాద్‌లో ఇంటర్ డిస్ట్రిక్ డబ్ల్యూపీసీ పోటీల్లో స్వర్ణ పతకాలను సాధించింది. ఈ నెల 24న హైదరాబాద్ నరేష్, సురేష్ క్లాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 60 కేజీల విభాగంలో 122.3 కేజీల బరవును రెండు విభాగాల్లో (బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్)ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు స్వర్ణ పతకాలను, ప్రశంస పత్రాలను అందుకుంది. డబ్ల్యూపీసీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమె తన విజయానికి సహకరించిన కోచ్ శేఖర్, నిఖిల్, సత్యకు కృతజ్ఞతలు తెలిపింది.

మహిళ అదృశ్యం

కొడిమ్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన సుక్రీదేవి అనే మహిళ అదృశ్యమైనట్టు ఆమె భర్త డోమినింగ్ శనివారం ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జ రాజు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 20న ఇంటిలో ఎవ్వరికి చెప్పకుండ సుక్రీదేవి వెళ్లినట్లు తెలిపారు. దీంతో బంధువుల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పుట్టిడు దుఃఖాన్ని కడుపులో పెట్టుకుని కష్టాలతోనే కలిసి నడుస్తూ బతుకుబండిని లాగాడు. తాను కష్టాల్లో ఉన్నా నలుగురికి నవ్వులు పంచాలనుకున్నాడు. హాస్యాన్ని తన అడ్రస్‌గా మార్చుకొని నవ్వుతూ నవ్విస్తూ ఆనందాన్ని పంచుతున్నాడు ఆర్‌ఎస్ నంద అలియాస్ రాదండి సదయ్య. యూ ట్యూబ్ స్టార్‌గా.. షార్ట్ ఫిలింలతో గ్రామీణ ప్రజల అభిమాన నటుడిగా మారాడు ఆర్‌ఎస్ నంద. తన తల్లి భాష మాధుర్యాన్ని జనానికి అందించాలనే లక్ష్యంతో వెండి తెరపై తన మాటల మతాబులు పేల్చుతూ నవ్వుల పువ్వులు పూయిస్తూ "జనానందమే.. సదానందం" అనే ట్యాగ్‌లైన్‌గా మారాడు. వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించే వరకు ఆయన జీవితమంతా కష్టాలమయమే.. నటనపై ఉన్న ఆసక్తి ఆయనను తొమ్మిది సంవత్సరాల వయసులోనే స్టేజీ ఎక్కించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఓపెన్ థియేటర్‌కు వచ్చే సినిమా గురించి ఊళ్లు తిరిగి ప్రచారం చేస్తే ఫ్రీగా సినిమా చూడనిచ్చే వారు. అక్కడే ఆయనకు నటనపై ఆసక్తి పెరిగింది. 2007లో ఆ కోరికను సుసాధ్యం చేసుకున్న ఆర్‌ఎస్ నంద ఇప్పటివరకు తన జీవిత పయనాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. అదేమిటో ఆయన మాటల్లోనే....



ఆదివారం ప్రత్యేకం

సదా..ఆనందం

- ముళ్లబాటలో నవ్వుల మూట
- ఒడిదుకులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు..
- షార్ట్ ఫిలిమ్స్‌తో మొదలుపెట్టి వెండితెర వరకు..
- నవ్వులు పంచుతున్న ఆర్‌ఎస్ నందా

మాది ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామం. వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ బతికే వాళ్లం.. పదో తరగతి వరకు కనగర్తిలోనే చదువుకున్నాను. నా చదువంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగింది. మా నాయన చిన్నతనంలో చనిపోయాడు. అమ్మ కూలి పనిచేసి చదివించింది. మా అమ్మ నెలకు 50 రూపా యలు ఇస్తే 25 రూపాయలు ఇంటి కిరాయికి పెట్టి 25 రూపాయలతో నెలరోజులు అన్నం వండుకొని బతికాను. అన్నం వండుకొని, అన్నంతో వచ్చిన గంజిని వంపుకొని ఒక పూట.. మిగతా రెండు పూటలు అన్నంలో కారం వేసుకొని తిని బతికాను. పావుకిలో నూనె తెస్తే 45 రోజులు జాగ్రత్తగా వాడుకునే వాడిని. స్నేహితుల పుస్తకాలు అడిగి చదువుకునే వాడిని. ఇంటర్‌లో చదివేటప్పుడు చెప్పులు ఉండేవికాదు. చెప్పులు ఎందు కు వేసుకోవడం లేదని ఎవరన్నా అడిగితే దేవుడి మొక్కు అని చెప్పేవాడిని. 1998 లోడిగ్రీ పూర్తి చేశాను. 2000 సంవత్సరంలో నాకు ఎస్టీటీగా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాతే ఎంఏ తెలుగు, ఎంఏ ఎకనామిక్స్ చేసి బీఎడ్ పూర్తిచేశాను.



● సినీ జీవితం....

చిన్నప్పటి నుంచే సినిమా తెరపై కనిపించాలన్న కోరిక ఉ ండేది. ఆ కోరిక షార్ట్ ఫిలింల వరకు తీసుకవెళ్లింది. సినిమాల్లో తెలంగాణ భాషను కొన్ని పాత్రలకు పరిమితం చేసి అపహాస్యం చేయడం బాధనిపించేది. నా తల్లి భాషలో ఉన్న మాధుర్యాన్ని ఎలాగైనా జనానికి అందించాలి... సినిమాలో అన్ని పాత్రలు నా భాషలోనే మాట్లాడాలి అని అనుకునేవాడిని. ఇప్పుడు అది సాధ్యమైంది. ఇవాళ తెలంగాణ భాష సినిమాకు ప్రధానంగా మారింది. 2007లో బతుకమ్మ సినిమాతో సినీ జీవితాన్ని ప్రారంభించాను. సింగిల్ డైలాగ్ ఉన్న పాత్రను చేసినా అది తృప్తిని కలిగించింది. ఆ తర్వాత రుద్రంగి, తుపాకి రాముడు, నానీ, బుజ్జి బంగారం, మల్లేశం, నేనే సరోజ, లగ్గంలాంటి 13 సినిమాల్లో నటించాను. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నాను. సినిమా రంగంలో మంచి కమేడియన్‌గా రాణించాలన్నది నా ఆకాంక్ష.

● నటనపై ఆసక్తి....

నాకు తొమ్మిది సంవత్సరాల వయసు ఉన్నపుడు మా ఊరికి ఒక బుర్ర కథ బృందం వచ్చింది. వారిని చూసి బుర్ర కథ నేర్చుకున్నా. మా బడిలో పనిచేసే మధుసూధన్‌రావు అనే ఉపాధ్యాయుడు బుర్ర కథ పుస్తకం తెచ్చిస్తే నేర్చుకొని ప్రధాన కథకుడిగా మొట్టమొదటిసారి స్టేజీ ఎక్కాను. 12 ఏళ్ల వయసు వచ్చే సరికి మా ఊరిలో వెంకటేశ్వర ఓపెన్ థియేటర్ వెలిసింది. అప్పుడు కుర్చీ టికెట్‌కు రెండు రూపాయలు, నేల టికెట్ ధర రూపాయి ఉండేది. నేడే చూడండి అంటూ ఒక బుంగ పట్టుకొని ఆ సినిమా గురించి ఊళ్లలో ప్రచారం చేస్తే రూపాయి ఇచ్చేవారు. రూపాయి వద్దంటే సినిమా చూడనిచ్చేవారు. అలా సినిమా చూసి నటనపై ఆసక్తి పెంచుకున్నాను. గ్రామాల్లో ప్రజానాట్య మండలి వారు స్టేజి నాటకాలు వేసే వారు. వాళ్లతో కలిసి నాటకాలు వేసేవాడిని. స్కూల్‌లో కూడా నాటకాలు వేశాను. నాకు పెళ్లి కావాలి... అనే నాటకంలో జిల్లాస్థాయిలో ఉత్తమ నటుడిగా గుర్తింపు లభించింది. పల్లెటూరోడు.. తుపాకి రాముడు.. అనే ఏకపాత్రాభినయం చేసే వాడిని.

● తెలంగాణ యాసలో షార్ట్ ఫిలిమ్స్

2007 నుంచి హాస్యమే ప్రధానంగా షార్ట్ ఫిలిమ్స్ చేయడం ప్రారంభించాను. తెలంగాణ యాసలోనే షార్ట్ ఫిలింలను తీయడం లక్ష్యంగా పెట్టుకున్నాను. కథారచయితగా, డైరెక్టర్‌గా, నటుడిగా వందకుపైగా షార్ట్ ఫిలిమ్స్ తీశాను. ఇతరులతో కలిసి నటించిన షార్ట్‌ఫిలిమ్స్ 500కుపైనే ఉంటాయి. మొట్టమొదట 'కండల కొండన్న..ఏతులు ఎక్కువ...' అనే లీడ్‌తో పది భిన్నమైన షార్ట్ ఫిలిమ్స్ తీశాను. నిర్మాణం, కథ, మాటలు, డైరెక్షనంతా నేనే. అప్పుడు యూట్యూబ్ ఎక్కువగా ప్రచారంలో లేకపోవడంతో సీడీలుగా విడుదల చేశాము. హాస్యంతో నాకు అవినాభావ సంబంధం ఉన్నది. చిన్నప్పటి నుంచే నేను మాట్లాడితే నవ్వేవారు. ఇది నాకు ఆసక్తికరంగా అనిపించింది. నేను రోజూ కలిసే వారినే మాట్లాడుతూ నవ్విస్తుంటే నటించి ఇతరులకు నా ప్రతిభ చూపించాలనుకున్నా.. అప్పుడే షార్ట్ ఫిలింల ఆలోచన వచ్చింది. కష్టాలు ఎదురైనా దానిని సాకారం చేసుకున్నాను. వాటికి మంచి స్పందన రావడంతో ఇక వెనుతిరిగి చూడలేదు. రెండు తెలుగు టీవీ చానల్స్‌లో కామెడీ ప్రధానంగా షోలు చేశాను.

● సంభాషణలే కథలుగా మారి..

2002లో కృపతో నాకు పెళ్లయింది. ఇద్దరు అబ్బాయిలు. నా భార్యా పిల్లలు నా నటనను చూసి సంతోషిస్తారు. నా భార్యకు నాకు మధ్య జరిగే సంభాషణలెన్నో కథలుగా మారి షార్ట్ ఫిలింలుగా వచ్చాయి. మా చిన్నబ్బాయి నా షార్ట్ ఫిలిమ్స్‌ను ఎడిట్ చేస్తాడు. కొందరు చేసిన మోసం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ఓ దశలో ఇల్లు కూడా అమ్ముకోవాలనుకున్నా.. ఒక్కొక్కటిగా వాటన్నింటిని అధిగమించా..

న్యూస్ బాక్స్

ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


కమర్ సుల్తానా

రాయికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండీ కమర్ సుల్తానా ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఇటీవల జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయి పాఠశాలల అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో ఎండీ కమర్ సుల్తానా ప్రతిభ కనబరిచింది. ఈ నెల 27న రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో జరిగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైంది. దీంతో ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిరుపేదలకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్వాధీన పరుచుకొని అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, రాధిక, స్వాతి, రాంరెడ్డి, కనుకయ్య, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

మల్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజామునుంచే వేలాదిగా భక్తులు కొండపైకి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు. భక్తులతో ఇబ్బందులు కలుగకుండ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్ తదితరులు పర్యవేక్షించారు.

● నరసింహుని సన్నిధిలో...

ధర్మపురి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూ పరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద తయారి సిబ్బంది 'వేతన' వివాదం

కోర్టును ఆశ్రయించిన కొండగట్టు సిబ్బంది


ప్రసాదాల తయారీ కేంద్రం

మల్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రసాదాల తయారీలో పని చేసే సిబ్బంది వేతనాల పెంపు వివాదం వారి విధుల నుంచి తొలగింపునకు దారి తీసింది. దేవస్థానం పరిధిలో భక్తుల కోసం నిత్యం లడ్డూ, పులిహోర, సిరా ప్రసాదం అందుబాటులో ఉంటుండగా వాటి తయారీ కోసం 14మంది వేతన సిబ్బందితో పాటు కూలి వేతనంపై మరి కొందరు పని చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం సిబ్బంది కోర్టును ఆశ్రయించి తమ వేతనాలను పెంచుకున్నారు. ఇటీవల మళ్లీ తమకు కనీస వేతనాలు అందించాలని, శాశ్వత ప్రాతిపదికన గుర్తించాలని కోర్టుకు వెళ్లారు. కనీస వేతనాలపై నివేదిక ఇవ్వాలనే కోర్టు ఆదేశాలపై స్పందించకపోవడంపై సిబ్బంది కోర్టు ధిక్కారం కింద దేవాదాయ శాఖ అధికారులపై మరోసారి న్యాయస్థానానికి వెళ్లారు. శనివారం ఈవో రామకృష్ణ రావును కలిశారు. అయితే కనీస వేతనాలు, శాశ్వత ప్రతిపాదికన నియామకం అనేది దేవాదాయశాఖ పరిధిలోకి వస్తుందని ధిక్కారం కేసు వెనక్కి తీసుకోవాలని సూచించారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాల్సిందేనని సిబ్బంది కోరారు. ప్రసాద తయారీలో పరిమితికి మించి సిబ్బంది ఉన్నారని తాము అవసరం ఉన్న వరకే సిబ్బందిని తీసుకుంటామని మిగితా సిబ్బంది ఆదివారం నుంచి పనులకు రావద్దని దేవస్థానం అధికారులు తేల్చి చెప్పారు. విధులకు వచ్చినా తీసుకోవద్దని అక్కడి సిబ్బందిని ఆదేశించారు

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

- బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

మల్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలు వీడనాడాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం మల్యాల మండల కేంద్రంలో బీడి కార్మిక సంఘం జగిత్యాల జిల్లా రెండో మహసభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. లక్షలాది మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి ఉన్నారని, ప్రభుత్వ ఆంక్షలతో బీడీ పరిశ్రమ నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెల కొందని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికులకు పనికి తగిన ఫలితం లేదని, వారి కోసం జిల్లాకో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని అన్నారు.

అలాగే బీడీ కార్మికులకు కనీస పింఛన్ ఆరు వేల రూపాయలు అందించి, బీడీ పరిశ్రమలోని అన్ని రకాల కార్మికులకు, కమిషన్ ఏజంట్లకు నెలకు నాలుగు వేల రూపాయల జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాడు తామన్నారు. అంతకు ముందు మల్యాలలో బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొక్కుల శాంత, సుతారి రాములు, విశ్వనాథం, ముఖం, గంగాధర్, మౌలానా, రాధ, కిరన్, దేవదాస్, రమ, అనసూర్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించండి

- బెటాలియన్ పోలీసుల ధర్నా
- ఎస్పీ కాళ్లు మొక్కుతూ వేడుకోలు

సిరిసిల్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు కోరారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 17వ బెటాలియన్‌లోని పోలీసులు కమాండెంట్ ఆఫీస్ దగ్గర ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ జాబ్ అంటే ఎంతో ఇష్టంగా కష్టపడి సాధించుకున్నామన్నారు. అందరికీ ఒకే రకంగా శిక్షణ ఇచ్చారని, తరువాత స్పెషల్ పోలీస్ అంటూ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా మార్చి వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పోలీస్ విధానాన్ని అమలుపర్చాలని డిమాండ్ చేశారు. బెటాలియన్‌లో మట్టిపనులు చేయిస్తున్నారని, నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్నారని అన్నారు. పోలీస్ డ్యూటీలకు సంబంధంలేకుండా వాగులో ఇసుక తెప్పిస్తున్నారని, మిషన్‌భగీరథ పైపులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. అంధ్రా అధికారులు తమపై పెత్తనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బెటాలియన్‌లో చేయిస్తున్న పనుల వీడియోలను చూపించారు. రెండు రోజుల క్రితం పోలీసుల భార్యలు తమ భర్తల వెట్టిచాకిరిపై జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేయగా కార్యాలయంలో కమాండెంట్ మాట్లాడిన తీరును తప్పుబట్టారు. ధర్నా పరిస్థితిని కమాండెంట్ ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు సమాచారం అందించగా ఆయన వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీస్ కానిస్టేబుల్ ఎస్పీ కాళ్లమీదపడి వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని, ఒకే పోలీస్ విధానం ఉండాలని కోరారు. ఎస్పీ ముందు పోలీసులు కంటతడిపెట్టడం అందరిలోనూ ఆవేదనను నింపింది. సమస్యలను డీజీపీకి నివేదిస్తామని ఎస్పీ హామీ ఇవ్వడంతో కానిస్టేబుల్‌లు శాంతించారు.


ఎస్పీ కాలు మొక్కుతున్న కానిస్టేబుల్


కానిస్టేబుల్‌ను ఓదారుస్తున్న ఎస్పీ

ఆనంద నిలయం

- అభాగ్యులకు అండగా 'మా అనాథ' వృద్ధాశ్రమం
- 18 ఏళ్లుగా సొంత ఇంటిలో సేవలు

అయినవారు దూరమైన అభాగ్య వృద్ధులకు అదొక ఆనంద నిలయం. పిల్లలు వదిలించుకున్న వారికి దేవాలయం. మతి స్థిమితం లేక రోడ్డున పడ్డ దీనులకు.. అంగవైకల్యంతో బాధపడుతున్నవారికి అన్నీతానై ఆత్మీయతను పంచుతున్నాడు గంభీరావుపేటలోని 'మా అనాథ' వృద్ధాశ్రమం నిర్వాహకుడు.

గంభీరావుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మా అనాథ వృద్ధుల ఆశ్రమం 18 ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం తీసుకోకుండా, విరాళాలు సేకరించకుండా తన సొంత ఇంటిలో గృహ వాతావరణాన్ని మరిపించే విధంగా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నాడు. అనాథ వృద్ధులకు అన్నీ తానై అండగా నిలుస్తున్నాడు నిర్వాహకుడు మల్లుగారి నర్సాగౌడ్. తల్లి, తండ్రుల వృద్ధాప్య బాధలను చూసి 2006లో తన ఇంటిలో ఆరుగురు అనాథ వృద్ధులతో వృద్ధుల ఆశ్రమాన్ని నెలకొల్పాడు. ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో పద్దెనిమిదేళ్లుగా వృద్ధాశ్రమ్నాన కొనసాగిస్తున్నాడు. ఈ ఆశ్రమంలో ఇప్పటి వరకు దాదాపు 200 మంది అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించాడు. అనారోగ్యంతో మంచం పట్టి తుది శ్వాస విడిచిన 28 మంది వృద్ధులకు అనాథల్లా కాకుండా అందరిలో ఒకరిగా దహన సంస్కారాలు పూర్తి చేశాడు. కరోనా సమయంలోనూ వృద్ధాశ్రమంలో కరోనా సోకిన ఒకరిద్దరికి స్వయంగా సేవలు అందించారు. స్వయంగా వంట చేయడం, వడ్డించడం, చేతగాని వారికి స్నానం చేయించడం, మంచనా పడినవారికి అన్నీ తానై సేవలు చేస్తాడు. పండగలు, పర్వదినాల్లో తమకు ఎవరూ లేరనే ఆలోచన రానివ్వకుండా వారి కళ్లల్లో ఆనందాన్ని నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాడు. రక్తసంబంధీకులకన్నా మిన్నగా అనుక్షణం వెంట ఉంటూ వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్నాడు. స్వయంగా సేవలందిస్తున్నారు. గోదావరిఖని, హన్మకొండ, నిజామాబాద్, సిద్దిపేట, ఎల్లారెడ్డిపేట, హైదరాబాద్, సిరిసిల్ల, కామారెడ్డి వంటి వివిధ జిల్లాలకు చెందిన అనాథ వృద్ధులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు.


వృద్ధురాలికి అన్నం తినిపిస్తున్న నర్సాగౌడ్..


గంభీరావుపేటలో 'మా అనాథ' వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు నర్సాగౌడ్

అదృష్టంగా భావిస్తున్నా..

- మల్లుగారి నర్సాగౌడ్, మా అనాథ వృద్ధుల ఆశ్రమం, నిర్వాహకుడు

వృద్ధులకు సేవ చేయడం నా అదృష్టంగా బావిస్తున్నా. మా సొంత ఊరిలో నా వాళ్ల మధ్యన మానవ సేవలో గడపడం పూర్వజన్మ సుకృతంగా బావిస్తున్నా. ఈ జన్మలో వృద్ధులకు సేవచేసే అవకాశం కల్గింది. సేవా కార్యక్రమాలు నిరాటంకంగా చేయడానికి ప్రోత్సహిస్తున్న వారందరికీ ధన్యవాదాలు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శివకుమార్ (ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గట్టుదుద్దెనపల్లికి చెందిన మయోజుల శివకుమార్(29) అనే యువకుడు కరీంనగర్‌లో తన పనులను ముగించుకొని మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళుతున్నాడు. మానకొండూర్ పోలీసుస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సిబ్బందిపై దాడి

రామడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరావుపేటలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.. ఎస్సై వి శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం గోపాల్‌రావుపేటలో లైన్‌మన్ నారాయణ సిబ్బందితో కలిసి లైన్ పునర్నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఆ సమయంలో ఇదే గ్రామానికి చెందిన ముంజ లచ్చయ్యగౌడ్ లైన్‌మన్ నారాయణపై దాడి చేశాడు. పనులు ఆపకుంటే చంపుతానని బెదిరించాడు. మరో లైన్‌మన్ జేరిపోతుల లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు లచ్చయ్యగౌడ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పల్లెలకు పట్టణ సొబగులు

(5వ పేజీ తరువాయి)

కార్పొరేట్ స్థాయి వ్యాపార సముదాయలు, పరిశ్రమలు, రహదారులు, తాగునీరు వసతి, మౌలిక సదుపాయాలు, గ్రామీణ ప్రాంతాలకు చేరనున్నట్లు, దీని ద్వారా జీవనోపాధి కూడా పెరగనున్నట్లు తెలుస్తోంది.

అక్రమ లే అవుట్‌లకు చెక్

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రజాప్రతినిధుల జోక్యంతో అక్రమ లే అవుట్‌లు ఏర్పడుతాయనే విమర్శలు ఉన్నాయి. వీటీడీఏ ద్వారా అక్రమ లే అవుట్‌లకు అవకాశం ఉండదని భావిస్తున్నారు. 300 గజాలు దాటితే వీటీడీఏ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. స్థానిక సంస్థలకు అదాయం పెరుగుతుంది. మరోవైపు రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల పెరుగుదలతో వ్యవసాయ భూములకు విఘాతం కలుగుతుందని, అభివృద్ధి పేరిట ప్రజల నిర్మాణాలకు నష్టం కలిగే అవకాశాలు ఉన్నట్లుగా భావిస్తున్నారు.

చైర్మన్‌గిరిపై ఆశలు

వేములవాడ పరిధికే పరిమితమైన వీటీడీఏను జిల్లా వ్యాప్తంగా విస్తరించడంతో చైర్మన్ పదవికోసం అశావహులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇతర జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు చైర్మన్లు ఉన్న క్రమంలో కాంగ్రెస్‌లో బలంగా ఉండే వ్యక్తులకు వీటీడీఏ చైర్మన్ పదవిని కూడా ఇస్తారనే చర్చ సాగుతోంది.



సిరిసిల్ల పట్టణం



రాజన్న సిరిసిల్ల జిల్లా మ్యాప్

వీటీడీఏ పరిధిలోని గ్రామాలు

వీటీడీఏ పరిధిని విస్తరిస్తూ కలిపిన రెవెన్యూ గ్రామాలు.

బోయినపల్లి మండలం : అనంతపల్లి, బోయినపల్లి, బూర్గుపల్లి, దుండ్రపల్లి, కొదురుపాక, కోరెం, కొత్తపేట, మల్లాపూర్, మల్లాపూర్, మాన్వాడ, నర్సింగాపూర్, శాభాష్‌పల్లి, తడగొండ, వర్దవెల్లి, విలాసాగర్ గ్రామాలు, ఇల్లంతకుంట మండలం అనంతగిరి, అనంతారం, దాచారం, ఇల్లంతకుంట, గాలిపల్లి, జంగమరెడ్డిపల్లె, జవారిపేట, కందికట్కూర్, ముస్కానిపేట, ఓగులాపూర్, పెద్దలింగాపూర్, పొత్తూర్, రహీంఖాన్‌పేట, రామోజీపేట, రేపాక, సిరికొండ, తాళ్లపల్లి, తిమ్మాపూర్, వల్లంపట్ల, వంతడ్పుల, వెల్జీపూర్.

గంభీరావుపేట మండలం : దమ్మన్నపేట, దేశాయిపేట, గజసింగవరం, గంభీరావుపేట, గోరంటాల, కుర్దు లింగపల్లి, కోళ్లమద్ది, కొత్తపల్లి, లక్ష్మీపూర్, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, ముచ్చర్ల, ముస్తాపానగర్, నర్మాల, సముద్రలింగాపూర్, శ్రీగాధ.

ముస్తాబాద్ మండలం : అవునూర్, బందనకల్, చీకోడు, చిప్పలపల్లి, గూడెం, గూడూరు, కొండాపూర్, మద్దికుంట, మోయినికుంట, మొర్రాయిపల్లె, మొర్రాపూర్, ముస్తాబాద్, నామాపూర్, పోత్గల్, తెర్లమద్ది.

వీర్నపల్లి మండలం : అడవిపదిర, గర్జనపల్లి, కంచర్ల, మద్దిమల్ల, వన్‌పల్లి, వీర్నపల్లి.

ఎల్లారెడ్డిపేట మండలం : అక్కపల్లి, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, బొప్పాపూర్, దుమాల, గొల్లపల్లి, గుండారం కోరుట్లపేట, నారాయణపూర్, పదిర, పోతిరెడ్డిపల్లి, రాజన్నపేట, సింగారం, తిమ్మాపూర్, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట.

తంగళ్లపల్లి మండలం : బద్దెనపల్లి, బస్వాపూర్, చీర్లవంచ, చింతల్‌ఠాణా, గండిలచ్చపేట, జిల్లెల్ల, కస్బెకట్కూర్, మండెపల్లి, నేరేళ్ల, ఓబులాపూర్, రామచంద్రాపూర్, సారంపల్లి, తాడూర్ తంగళ్లపల్లి, వేణుగోపాల్‌పూర్.

వేములవాడ రూరల్ మండలం : బొల్లారం, చెక్కపల్లి, ఎదురుగట్ల, ఫాజుల్ నగర్, హన్మాజిపేట, లింగంపల్లి, మల్లారం, మర్రిపల్లి, నూకలమర్రి, వట్టెంల, వెంకటంపల్లి.

చందుర్తి మండలం : అనంతపల్లి, బండపల్లి, చందుర్తి, జోగాపూర్, లింగంపేట, మల్యాల, మర్రిగడ్డ, మూడపల్లి, సనుగుల, తిమ్మాపూర్, ఏన్గల్.

రుద్రంగి మండలం : మానాల, రుద్రంగి గ్రామాలు.

కోనరావుపేట మండలం : బావుసాయిపేట, ధర్మారం, కనగర్తి, కొలనూర్, కోనరావుపేట, కొండాపూర్, మల్కపేట, మామిడిపల్లి, మరిమడ్ల, మర్తనపేట, నాగారం, నిమ్మపల్లి, నిజామాబాద్, పల్లిమక్త, రామన్నపేట, శివంగలపల్లి, సుద్దాల, వట్టిమల్ల, వెంకట్రావుపల్లె గ్రామాలను వీటీడీఏలో చేర్చారు.

న్యూస్ బాక్స్

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

రుద్రంగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రుద్ర ంగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి పనులపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన సీసీ రోడ్డు, మురికి కాలువలపై చర్చించారు. వంద రోజుల్లో ఉపాధిహామీ ద్వారా కూలీలు చేసే పనిని గుర్తించి చర్చించినట్లు అధికారులు తెలిపారు. టీఏ ధనుంజయ్, కార్యదర్శి రామ్‌దాస్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, స్వర్గం పరంధామ్, తర్రె లింగం, సూర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మల్లేశం కుటుంబానికి స్థానికులు శనివారం అండగా నిలిచారు. పోగు చేసిన రూ.57 వేల నగదును ఆ కుటుంబానికి అందించారు. తాజా మాజీ సర్పంచ్ రజిత, తాజా మాజీ ఉప సర్పంచ్ హనుమంతు, నాయకులు శ్రీనివాస్, సతీష్, మనోజ్, సత్తిరెడ్డి, రవి, ఆగం, ప్రసాద్, రాజం, రాములు, రాజిరెడ్డి, మధు, మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, బాలమల్లు, ఆంజనేయులు, రాజయ్య, నారాయణ పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

ముస్తాబాద్, అక్టోబరు 26 : మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన పేదింటి వధువుకు పుస్తెమట్టెల అందజేశారు.గ్రామానికి చెందిన మండపల్లి రాములు, కూతురు వివాహం వచ్చే నెల 3న ఉన్నందున పరిస్థితి తెలుసుకొని గూడెం వాస్తవ్యుడు చిట్నేని మాధవి, వెంకటేశ్వర్‌రావు రూ.5 వేల నగదుతో పాటు పుస్తెమట్టెలు సమకూర్చారు. వాటిని విద్యాసాగర్‌రావు అందించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పొన్నాల పద్మారెడ్డి, ఏనుగు వేణు, దమ్మ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

చందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి నిధులు చేయాలని చందుర్తి మండల ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. శనివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆగం



సమావేశంలో మాట్లాడుతున్న మధు

తంగళ్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి చేస్తే, పది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలను ఆగం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు విమర్శించారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధికి మించి మీరు చేసి విమర్శలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి గల్లి స్థాయి చోటమోట లీడర్లకు లేదన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సిరిసిల్ల పద్మశాలీలపై ప్రేముంటే యారన్ డిపో సిరిసిల్లకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కేటీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న ఆది శ్రీనివాస్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఫొటోలకు ఫోజులు ఇచ్చుడు కాదని, ప్రజల్లో అంటూ వారిని ఆదుకొనే ప్రయత్నం చేయాలని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదిలాబాద్ రైతు బహిరంగ సభలో రైతులందరూ కేటీఆర్‌కు బ్రహ్మరథం పడితే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. రైతుల పక్షాన మాట్లాడాం కేటీఆర్ తప్పా? రైతులను ఆగం జేస్తూ పరిపాలన సాగిస్తోంది మీరు కాదా? అని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కొయ్యాడ రమేష్, గుండు ప్రేమ్ కుమార్, అమర్ రావు, నక్కకొమురయ్య, చెన్నమనేని రాజేశ్వర రావు, గుగ్గిళ నరహరి, సుంకటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వార్డు ఆఫీసర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు ఆఫీసర్లు

వేములవాడ, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్ జయరాములపై జరిగిన దాడిని నిరసిస్తూ వార్డు ఆఫీసర్లు వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వార్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మల్లారం అర్జున్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్ జయరాములపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, విధుల్లో ఉన్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వార్డు అధికారులు ఆంజనేయులు, పరుశురాం, వేణు, సుధీర్, రహీం, రాజేందర్, రాజేశ్, మంజుల, అంజమ్మ, లావణ్య, దేవేందర్, రేష్మ, స్వప్న, మేఘమాల, చంద్రకళ, లక్ష్మి ఉన్నారు.

చెవిలో పువ్వులతో నిరసన

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులను తక్షణమే విడదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తాజా మాజీ సర్పంచులు చెవిలో పువ్వులతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో పెండింగ్ బిల్లులు విడదల చేయాలని డిమాండ్ చేస్తూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఎనిమిదో రోజు చేరుకుంది. బహుజన సేన ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, గ్రామ పంచాయతీ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, లేని పక్షంలో వారికి మద్దతుగా ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తాజా మాజీ సర్పంచులు

హుండీ లెక్కింపులో

ఉద్యోగి చేతివాటంపై విచారణకు ఫిర్యాదు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపులో ఉద్యోగి చేతి వాటం పేరుతో శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఈవో కార్యాలయం నుంచి ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. హుండీ లెక్కింపులో జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయ హుండీ లెక్కింపులో భాగంగా పటిష్టమైన భద్రత మధ్య హుండీ లెక్కింపు చేపడుతున్నామని, గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అనుమానాస్పదంగా కనిపించాడని తెలిపారు. ఖాళీ సంచులను పరిశీలించగా స్వదేశీ, విదేశీ నగదు గుర్తించి ఉద్యోగంలో నుంచి తీసివేశామని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుటామని పేర్కొన్నారు.

వర్కర్ టు ఓనర్ పథకాన్ని వర్తింపజేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నేతన్నలు

తంగళ్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వర్కర్ టు ఓనర్ పథకాన్ని తమకూ వర్తింపజేయాలని తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామానికి చెందిన నేతన్నలు కోరారు. శనివారం జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మకాలనీకి చెందిన పద్మశాలీలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వినతి పత్రం అందజేశారు. నేతన్నలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని పద్మశాలీలకు వర్కర్ టు ఓనర్ పథకం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు గడ్డం మధుకర్ తెలిపారు. చేనేత జౌళి శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి ఇందిరమ్మ కాలనీ పద్మశాలీలను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించారని పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతుకూలీ సంఘం నాయకులు కోరారు. శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా రైతుకూలీ సంఘం అధ్యక్షుడు జామండ్ల రవీందర్ మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులు పెరిగినందున ధాన్యానికి క్వింటాల్‌కు రూ.4 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని తూకం వేయడానికి ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు తరగుపేరుతో కోతలు విధించవద్దని అన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్నివిధాలైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి మూషం ఆంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు జక్కనపల్లి బాబు పాల్గొన్నారు.

ఢిల్లీ మహాధర్నాకు టీపీసీసీ సభ్యుడు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీసీ గణన, బీసీలకు పార్లమెంట్‌లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏర్పాటు చేసిన మహాధర్నాకు టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం ఢిల్లీ తెలంగాణ భవనంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని వివరించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



చైర్మన్ వెంకటయ్యతో కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని కోరారు. కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు తిరుపతి, దయాకర్‌రావు, రాజేందర్, బాల్యనాయక్, విఠల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ముగిశాకే కమిటీపై సమావేశం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాకే కమిటీపై సమావేశం నిర్వహించాలని, దళితుడు ఆలయ కమిటీ చైర్మన్ కావడంతోనే కొందరు జీర్ణించుకోలేక అడ్డంకులు సృష్టిస్తున్నారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రామచంద్రం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి శనివారం మాట్లాడారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గతేడాది నవంబరులో ప్రజలందరి మద్దతుతో దళితుడిని ఎన్నుకుంటే అప్పటి నుంచి కొందరు వ్యక్తులు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రెండేళ్లపాటు కొనసాగిన స్వామివారి సేవలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు భూమ రాజం, రామస్వామి, నర్సయ్య, శంకర్, చెన్నయ్య, ఆనందం, దాసు, మల్లయ్య, మల్లేశం, సత్యనారాయణ, ధర్మేందర్, బాబు, కరుణాకర్, గణేశ్, వంశీ, రాకేశ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కూలీ హఠాన్మరణం

గంభీరావుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాలలో శనివారం విషాదం చోటు చేసుకుంది. బండి రాములు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కూలీ పనులకు వెళ్లి వచ్చిన రాములుకు చాతిలో నొప్పి రావడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లిన కొద్ది సేపటికే రాములు మృతి చెందాడు. గుండెపోటుతో రాములు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాములుకు భార్య లక్ష్మి, కూతురు పూర్ణిమ ఉంది. కొడుకులు లేక పోవడంతో కూతురు పూర్ణిమ తండ్రి చితికి నిప్పు పట్టింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రాజు కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు కట్టివ్వాలి

వేములవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు కట్టి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కదారి రాములు డిమాండ్ చేశారు. శనివారం వేములవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలు వెచ్చించి ఇల్లు కట్టివ్వాలన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టి ఇవ్వాలని, స్థలం లేనివారికి డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలని కోరారు. వేములవాడ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో కనీస మౌలిక వసతులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి గాజుల పోశెట్టి, మండల కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

వేములవాడ, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.హరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్జీజీ ఉపాధ్యాయులకు రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్‌ను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఓటు హక్కు కల్పించాలని కోరారు.

పాఠశాలలోకి నాగుపాము

ఇల్లంతకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని ఆరెపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి శనివారం నాగుపాము వచ్చింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉదయం పాఠశాల ప్రారంభం కాకముందు పాము పాఠశాలలోకి వెళ్లడాన్ని గ్రామస్తుడు ఒకరు గమనించారు. విషయాన్ని ఉపాధ్యాయుడు అరుకుటి మల్లేశం దృష్టికి తీసుకెళ్లాడు. అప్పటికే పాఠశాలకు చేరుకుంటున్న విద్యార్థులందరినీ ఒకచోట కూర్చోబెట్టి నాగుపాము ఎక్కడ ఉందో వెతికారు. కొంతసేపటికి పాఠశాల ఆవరణలో పాము కనిపించడంతో బయటకు పంపించారు.

నేడు మాలల సన్నాహక సభ

గంభీరావుపేట, అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) పెద్దూరు సమీపాన ఆదివారం నిర్వహించనున్న మాలల ఆత్మీయ సన్నాహక సభ తరలి రావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా బాధ్యుడు మల్యాల రాజవీర్ పిలుపు నిచ్చారు. గంభీరావుపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రద్దు విషయమై గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అభిప్రాయ సేకరణ చేపట్టి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ జిల్లా కమిటీ నాయకులు ఉన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

గంభీరావుపేట, అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వం తప్పిదాలతో గతి తప్పిన రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెడుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన కల్వకుంట్ల లక్ష్మణ్‌రావును సన్మానించారు. ఈ సందర్భంగా పర్శ హన్మండ్లు మాట్లాడుతూ గతంలో నామినేటెడ్ పదవులను అర్హులైన వారికి సిఫారస్ చేస్తే కొందరు దొడ్డిదారిన తెచ్చుకున్నారని ఆరోపించారు. నాయకులు రాజు, రంగారావు, కాశాగౌడ్, పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోని నాయకులు, విద్యార్థులు శనివారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, సాత్విక్, ప్రణయ్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ముట్టడించారు. పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,300 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు మారిన విద్యార్థుల భవిష్యత్ మారడం లేదన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని మాట తప్పారని ఆరోపించారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో విద్యార్థుల తరఫున ఆందోళనకు సిద్ధమవుతామని కళ్యాణ్‌కుమార్ హెచ్చరించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ భూపతికి వినతి పత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకాష్, నాయకులు అవినీస్, ప్రణయ్, తరుణ్ పాల్గొన్నారు.



గంభీరావుపేటలో బైఠాయించిన నాయకులు



ఎల్లారెడ్డిపేటలో..

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయ కల్యాణ మండపంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో (ఫ్లాగ్‌డే) భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలువాలన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఫ్లాగ్‌డే సందర్భంగా రక్తదానం చేయడం గొప్ప కార్యక్రమం అన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ విధి నిర్వహణనే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసిన పోలీసులను స్మరించుకోవడానికే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అమరులైన పోలీసులను సమాజం ఎప్పటికీ మరువదన్నారు. ప్రజలను కాపాడుతూ సంఘ విద్రోహశక్తుల చేతుల్లో బలైన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. సమాజ రక్షణ కోసం నింతరంగా కృషి చేసే పోలీసుల శ్రమ వృథాగా పోదన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్, షార్ట్ ఫిలిమ్స్, ఫొటో గ్రఫీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రెగ్యులర్ పోలిసింగ్‌తోపాటు ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు రాష్ట్రంలో ఉన్న ఎంతోమంది తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, డెంగ్యూ వ్యాధిగ్రస్థులకు రక్తం చాలా అవసరమని, వారికి రక్తదానం ఎంతో ఉపయోగపుతుందని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తోపాటు పోలీసు అధికారులు, సిబ్బంది, యువకులు దాదాపు 600 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరిని కలెక్టర్, ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములావడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుడ్ల రవి, వైస్ చైర్మన్ పి.వేణుకుమార్, కార్యదర్శి పి.శివప్రసాద్, ట్రెజరర్ జి. శివప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా చైర్మన్ కేశవరెడ్డి, మంచిర్యాల కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.వి.శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



రక్తదానం చేస్తున్న యువకులు, పోలీసులు